HICON SERIES

CLASS 4 TELUGU

తెలుగు వెలుగు CLASS 4

# LESSON 3







CLICK HERE TO ACTIVATE

**LESSON**
PART 1

# 3 పి.వి. నరసింహారావు



భారతదేశ ప్రధానమంత్రి పదవిని చేపట్టిన ఒకే ఒక్క తెలుగువాడు పాములపర్తి వేంకట నరసింహారావు. దక్షిణ భారతదేశం నుండి ఎంపికైన మొదటి ప్రధానిగా కూడా గుర్తింపు పొందారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం ఏర్పడిన క్లిష్ట పరిస్థితులలో 10 వ భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, సమర్థవంతంగా నిర్వహించి అపర చాణుక్యునిగా ప్రశంసలందుకున్నారు. ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి, గాడితప్పిన భారత ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారు. ఆర్థిక సంస్కరణల పితామహునిగా కీర్తింపబడ్డారు.

పి.వి. నరసింహారావు 1921వ సంవత్సరం, జూన్ 28న తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో జన్మించారు. వీరి తల్లిపేరు రుక్మాబాయి. తండ్రి సీతారామారావు. కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు వీరిని దత్తత తీసుకున్నారు. అప్పటి నుండి పాములపర్తి వేంకట నరసింహారావు అయ్యారు.


పి.వి. నరసింహారావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకునే రోజుల్లోనే నిజాం ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరించి, వందేమాతరం గీతాన్ని పాడారు. అందుకు విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరింపబడ్డారు. అప్పుడు ఒక మిత్రుని సహాయంతో నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేరి న్యాయవాది పట్టా సంపాదించారు. వీరు స్వాతంత్రోద్యమంలోనూ, హైదరాబాద్ విముక్తి పోరాటంలోనూ పాల్గొన్నారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావులు వీరికి మార్గదర్శకులు.


1957లో మంథని నియోజక వర్గం నుండి మొదటిసారి శాసన సభకు ఎన్నికయ్యారు. అప్పటినుండి వివిధ స్థాయిలలో రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానమంత్రిగా అనేక పదవులు నిర్వహించారు. ఆయన ఏ పదవి చేపట్టినా ఆ పదవికే వన్నె తెచ్చేవారు. తెలుగువారి కీర్తి పతాకాన్ని ఎర్రకోటపై ఎగురవేసిన తెలుగు బిడ్డ పి.వి. నరసింహారావు.




H4TR

పి.వి. నరసింహారావు బహుభాషా కోవిదులు. 17 భాషలలో అనర్గళంగా మాట్లాడేవారు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన వేయిపడగలు పుస్తకాన్ని 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువదించారు. ఆయనకు ఈ పుస్తకానికి కేంద్రసాహిత్య అకాడమి బహుమతి వచ్చింది. నరసింహారావు తన ఆత్మకథను 'ఇన్‌సైడర్' పేరుతో రచించారు. ఈ పుస్తకం 'లోపలి మనిషి'గా తెలుగులోకి అనువాదం అయ్యింది.














పి.వి. నరసింహారావుకు ఐదుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. నిరాడంబర జీవితాన్ని గడిపి ఆయన 2004, డిశంబరు 23న కన్నుమూసారు.

# అభ్యాసం

## I. అర్థాలు

| | | |
|---|---|---|
| మరణం | = | మృతి, చావు |
| క్లిష్టమైన | = | బాధాకరమైన |
| ప్రశంస | = | పొగడ్త |
| సంస్కరణలు | = | మెరుగుపరచేటందుకు చేసే మార్పులు |
| దత్తత తీసుకొనుట | = | సంతానం లేనివారు ఇతరుల పిల్లలను తమ పిల్లలుగా పెంచుకొనుట |
| జన్మించుట | = | పుట్టుట |
| నిషేధం | = | ఆపుచేస్తూ జారీ చేసిన ఆజ్ఞ |
| ధిక్కరించు | = | ఎదురించు |
| బహిష్కరించు | = | వెలివేయు |
| మార్గదర్శకులు | = | దారిచూపినవారు |
| వన్నెతెచ్చుట | = | ప్రతిష్ఠను పెంచుట |
| పతాకం | = | జెండా |
| అనర్గళంగా | = | నిరాటంకంగా |
| అనువదించు | = | తర్జుమాచేయు |

## II. పదజాలం

### (అ) వ్యతిరేక పదాలు రాయండి.

1. ప్రధానం × ________
2. సమర్థత × ________
3. ప్రశంస × ________
4. కీర్తి × ________
5. లోపల × ________

### (ఆ) బహువచనాలు రాయండి.

1. మంత్రి – ________
2. విద్యాలయం – ________
3. పుస్తకం – ________
4. పదవి – ________

### (ఇ) క్రింది ఖాళీలను పూరించండి.

1. పి.వి. నరసింహారావు ________ నియోజక వర్గం నుండి మొదటిసారి శాసనసభకు ఎన్నికయ్యారు.
2. పి.వి.నరసింహారావు ________ భాషలలో అనర్గళంగా మాట్లాడేవారు.
3. "వేయిపడగలు" పుస్తకాన్ని రాసినవారు ________
4. పి.వి. నరసింహారావు తన ఆత్మకథను ________ పేరుతో రచించారు.
5. పి.వి. నరసింహారావు ________ గ్రామంలో జన్మించారు.

**(ఈ) క్రింది పదాలు ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

1. వన్నెతెచ్చుట : ______
2. మార్గదర్శకులు : ______
3. క్లిష్టపరిస్థితులు : ______
4. ధిక్కరించు : ______

**(ఉ) జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. | పి.వి. జన్మించిన సంవత్సరం | ( ) | (క) 17 |
| 2. | పి.వి. మరణించిన సంవత్సరం | ( ) | (గ) 1957 |
| 3. | పి.వి. మాట్లాడగల్గిన భాషలు | ( ) | (చ) 1921 |
| 4. | పి.వి. మొదటిసారి శాసనసభకు ఎంపికైన సంవత్సరం | ( ) | (జ) 2004 |

## III. ప్రశ్నావళి

**(అ) ఈ క్రింది ప్రశ్నలకు ఒకటి లేక రెండు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పి.వి.నరసింహారావు ఎప్పుడు, ఎక్కడ జన్మించారు ?
2. పి.వి.నరసింహారావును దత్తత తీసుకున్నది ఎవరు ?
3. పి.వి.నరసింహారావుకు మార్గదర్శకులు ఎవరు ?
4. పి.వి.నరసింహారావు ఏయే ఉద్యమాలలో పాల్గొన్నారు ?

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఐదు లేక ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పి.వి. నరసింహారావు జీవిత విశేషాలను రాయండి.
2. “తెలుగువారి కీర్తి పతాకాన్ని ఎర్రకోటపై ఎగురవేసిన తెలుగు బిడ్డ పి.వి.” – వివరించండి.

## IV. వ్యాకరణం

**(అ) ఈ క్రింది వాక్యాలలోని నామవాచకాలను గుర్తించి, వాటిక్రింద గీత గీయండి.**

1. శ్రీరాముడు అయోధ్యకు రాజు.
2. హిమాలయ పర్వతం ఎత్తైనది.
3. అడవిలోని సింహం నగరంలోకి వచ్చింది.
4. బడిలో బల్లలను, కుర్చీలను ఏర్పాటుచేసింది మా నాన్నే.
5. మా ఇంట్లో వేప, మామిడి, దానిమ్మ చెట్లు ఉన్నాయి.

**ఈ క్రింది వాక్యాలను చదవండి.**

రాఘవేంద్రరావు తెలుగు ఉపాధ్యాయుడు. ఆయనంటే పిల్లలకు చాలా ఇష్టం. ఆయన పాఠాలను చక్కగా చెబుతాడు.

పై వాక్యంలో రాఘవేంద్రరావు పేరును తెలుపుతుంది. కాబట్టి అది **నామవాచకం**. అయితే తర్వాత వాక్యాల్లో రాఘవేంద్రరావుకు బదులుగా "ఆయన" అని రాయడం జరిగింది. ఈ విధంగా పేరుకు బదులుగా వచ్చే పదాన్ని "**సర్వనామం**" అంటారు.

ఉదా : నేను, మేము, ఇది......

**(ఆ) ఈ క్రింది వాక్యాలలోని సర్వనామాలను గుర్తించి వాటి క్రింద గీత గీయండి.**

1. శారద చిత్రకారిణి. ఆమె చిత్రాలు అద్భుతంగా ఉంటాయి.
2. అడవిలో ఏనుగులు ఉంటాయి. అవి గుంపులు గుంపులుగా వెళతాయి.
3. దేశాన్ని సైనికులు కాపాడుతున్నారు. వారి త్యాగం వెలకట్టలేనిది.

## V. ప్రాజెక్టు పని



ఇప్పటి వరకు పనిచేసిన భారత ప్రధానుల వివరాలు సేకరించి పట్టికలో నమోదు చేయండి.

| వ. సం. | ప్రధాని పేరు | కాలము |
|---|---|---|
| | | |